# మినీకథ

## పనిమనిషి

ఓ.ఆర్.కె.రావ్

"రా! లోపలికి రా! ఇంత ప్రొద్దుపోయిం తరవాత వచ్చేవేమిటి? నీకోసమే ఎదురు చూస్తున్నాను. ఈ రోజు ఉదయమే యీ వాటాలో అద్దెకి దిగాము. విజయవాడ మంచి ట్రాన్స్‌ఫర్ అయింది. ఎలాగైతేనేం వెంటనే వాటా అద్దెకి దొరికింది. మా రెండో వాడికి కాలేజీలో సీటు కూడా యిస్తామని అన్నారట. మా యింట్లో ఉండేది నేను. మా ఆయన.యిద్దరుపిల్లలు. పెద్దవాడు బి.ఎ. ప్యాసై ఉద్యోగాన్వేషణలో వున్నాడు. మా ఆయనకి ఉదయాన్నే యిడ్లీ టిఫిన్ అంటే యిష్టం. పిల్లలకి యిడ్లీ అంటే మంట. వాళ్ళకి దోశలు యిష్టం. ఈ రెండింటికి పప్పు రుబ్బాలి. యిల్లు వాకిలి తుడవాలి. వారానికోసారి ఫినయిల్ వేసి శుభ్రంగా కడగాలి. బట్టలు ఉతకాలి. అంట్లు ఏమంత ఎక్కువ వుండవు. రెండు పూటలా నిగనిగలాడేటట్టు తోమాలి.నీళ్ళు తోడాలి.మా పెద్దవాడికి చన్నీళ్ళ స్నానం పడదు. జలుబు చేస్తుంది. వేడి నీళ్ళు కావాలి. ఎప్పుడైనా బంధువులొస్తే అంట్లు. బట్టలు. కాస్త ఎక్కువ పడతాయి-విసుక్కోకూడదు. నీ కష్టం ఏమాత్రం వుంచుకోను. ఉదయాన్న మిగిలిపోతే టిఫిన్. కాఫీ యిస్తాను.భోజనం మాత్రం పెట్టడానికి అవదు. మధ్యాహ్నం టీ కావాలంటే అరకప్పు యిస్తాను. అయినా టీ ఎక్కువగా త్రాగడం అనారోగ్యమటగా! ప్రతి దినం ఉదయాన్నే డిపోకి వెళ్ళి పాలసీసాలు. వారానికి రెండు రోజులు బజారుకెళ్ళి కూరలు. శనివారం నాడు రేషను. ఆదివారం కిరసనాయిలు తీసుకు రావాలి. ఇవికాక చిల్లర మల్లర పనులుంటాయనుకో. ప్రతి దీపావళికి నలభై రూపాయిలకి తక్కువ లేకుండా విలువ చేసే చీర. జాకెట్టు గుడ్డ పెడతాను. నెలకి జీతం ముప్ఫయి రూపాయలు. ఇష్టమైతే రేపే డ్యూటీలో చేరు."

"ఏమండి పిన్నిగారు?"

"పిన్నిగారా? అమ్మగారని పిలవలేవూ! అయినా నా పేరు సుబ్బలక్ష్మి"

"సుబ్బలక్ష్మిగారూ. నేను ప్రక్కవీధిలో వున్న ప్లీడరు సూర్యారావుగారి పెద్దమ్మాయినండీ. నేను ఆఫీసు నుంచి రాగానే మా అమ్మ చెప్పింది. మీ ఆయనగారు పేరుప్రఖ్యాతులు గాంచిన రచయిత భాగ్యారావు గారని. బదిలీ అయి యీ ఊరు వచ్చేరని. పరిచయం చేసుకుపోదామని వచ్చాను.

"ఇంతకీ పిన్నిగారూ! మీకు కావలసింది పని మనిషికాదు. నేనొక ఉపాయంచెప్పనా? త్వరలో మీ పెద్దబ్బాయికి పెళ్ళిచేసి. కోడలు యింటికి వస్తే మీరు చెప్పిన పనులన్నిఆమె మీ చేత చేయిస్తుంది. ఖర్చు మిగులుతుంది. ఏమంటారు? బాబాయిగారు వస్తే.దౌర్భాగ్యరావుగారని పేరు మార్చుకోమని నే చెప్పానని చెప్పండి పాపం" అంతే-సుబ్బలక్ష్మి నిర్ఘాంతపోయింది."



# మంచి మాటలు

ప్రజల వాణి పరమేశ్వరుని వాణి.

—ఆల్కుయి 735-804

* * *

కోపిష్టి మనిషి ఎప్పుడూ తాను చేయకలిగినదాని కంటె ఎక్కువ చేయగలను అనుకొంటాడు.

—ఆల్‌బర్టినో ఆఫ్ బ్రెషియా c.1190 c.1270

* * *

చర్చికి దగ్గరయిన కొద్ది భగవంతునికి దూరమైనట్లే.

—బిషప్ లాన్‌స్లాట్ ఆండ్రూస్ 1555-1626

* * *

శత్రువు నుంచి సైతం మనిషి జ్ఞానాన్ని సంపాదించవచ్చు.

—అరిస్టోఫేన్స్ 444-380 బి.సి.

* * *

టీ కప్పులో తుపాను

—(ఈ ప్రయోగం చేసినది విలియం బ్రెల్ బెర్నార్డ్-ఒక ప్రహసనానికి పేరు పెట్టాడు) 1807-1875

* * *

యువకులకు నేనిచ్చే సలహా మూడు ముక్కల్లో— పనిచేయండి. పనిచేయండి. పనిచేయండి.

—బిస్మార్క్ 17[illegible]—1812

* * *

అమెరికా భగవంతుని మాతృభూమి.

—ఆకాశ రామన్న (1921 నుంచి వాడుకలో వుంది)

* * *

పనిచేస్తే ప్రార్థన చేసినట్లే.

—ఆకాశ రామన్న

స్నేహితుడంటే ఎవరు? రెండు శరీరాల్లో నివసించే ఒకే ఆత్మ.

—అరిస్టాటిల్